ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జనగామ

శుక్రవారం 19 జూలై 2024

విజయమాతగా భద్రకాళి

భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు 13వ రోజైన గురువారం కూడా ఘనంగా జరిగాయి. కాళీ క్రమాన్ని అనుసరించి ఉత్సవ మూర్తిని బలాకాగా అలంకరించి, భద్రకాళి మాతను విజయమాతగా అలంకరించారు.

- వరంగల్ కల్చరల్



'రుణ' సంబురం

- రుణమాఫీపై రైతుల్లో హర్షాతిరేకాలు
- రూ.లక్షలోపు ఖాతాల్లో జమ
- జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు, అన్నదాతల సంబురాలు



రఘునాథపల్లిలో రాహుల్, రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కడియం శ్రీహరి, కావ్య, కాంగ్రెస్ నాయకులు

జనగామ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ అన్నదాతల మోహాల్లో వెలుగులు తెచ్చింది. రుణమాఫీ నేపథ్యంలో జిల్లా అంతటా సంబురాలు అంబరాన్నంటాయి. జిల్లా అంతటా కాంగ్రెస్ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. రైతులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న రుణమాఫీ ఎట్టకేలకు అమలు కావడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిలుపుకోవడంతో అన్నదాతల ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. రుణమాఫీ అమలులో భాగంగా గురువారం మొదటి విడతగా రూ. ఒక లక్ష లోపు ఉన్న రుణాలన్నీ మాఫీ అయ్యాయి. గురువారం సాయంత్రం నాలుగు గంటల తర్వాత రూ. లక్ష లోపు రుణాలు ఉన్న రైతులకు మాఫీ మొత్తాన్ని రైతుల రుణ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. మాఫీ జరిగినట్లు రైతుల ఫోన్లకు మెసేజ్‌లు వచ్చాయి. కొన్ని సాంకేతిక కారణాల వల్ల కొందరికి మెసేజ్‌లు రాకపోయినప్పటికీ మాఫీ మాత్రం జరిగిందని అధికారులు చెబుతున్నారు. కాగా.. రుణమాఫీ ప్రారంభోత్సవంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున సంబురాలు జరిగాయి. ఈ సంబురాల్లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు. జిల్లాలోని ఆయా మండ లకేంద్రాలు, గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయా మండలకేంద్రాలు సంబురాలు జరగగా, ప్రభుత్వ ఆధ్వర్యంలో మండలానికొకటి ఎంపిక చేసిన రైతు వేదికల్లో సంబురాలు నిర్వహించారు. జనగామ మండలం గానుగుపహాడ్ రైతు వేదికలో జరిగిన వేడుకలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘునాథపల్లి, చిల్పూరు, స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగిన వేడుకల్లో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పాలకుర్తిలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పాల్గొన్నారు. ఆయా రైతు వేదికల్లో జిల్లా అధికారులు వేడుకల్లో పాల్గొన్నారు.

మిగతా 8వ పేజీలో...



జనగామలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు

అర్హులైన రైతులందరికీ రుణమాఫీని వర్తింపజేయాలి


కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

జనగామ రూరల్, జూలై 18: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రుణమాఫీ పథకాన్ని అర్హులైన రైతులందరికీ వర్తింపచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం రైతు రుణమాఫీ అమలు తీరుపై కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వ్యవసాయ శాఖ, బ్యాంక్ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ జిల్లాలో మెదటి విడత 39,635 మంది రైతు కుటుంబాలకు వర్తిస్తుందని, ప్రభుత్వం రూ. 233 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మొదటి విడతగా రూ.లక్ష వర కు, రెండవ విడతగా రూ. లక్ష 50 వేల వరకు, 2లక్షల వరకు దశల వారీగా రుణమాఫీ చేస్తుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ మహయజ్ఞాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రేషన్ కార్డు లేని వారికి కూడా రుణమాఫీ వర్తిస్తుందన్నారు. మత్స్యశాఖ ద్వారా సుమారుగా రెండు వేల మంది లబ్ధిదారులను గుర్తించడం జరిగిందని, వారికి డీఆర్డీఏ ఏపీఎంలతో కలిసి బ్యాంకర్లు మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. పాడి, కోళ్ల పరిశ్రమ ఉత్పత్తులు, సోలార్ యూనిట్స్ చేపట్టేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీధర్, వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్, ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి లత, సహకార శాఖ అధికారి రాజేందర్ రెడ్డి, బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్ రైతువేదికలో ట్రయల్ రన్ ద్వారా ఎల్ఈడీలో రైతు నేస్తం కార్యక్రమాలు





జఫర్‌గడ్‌లోని రైతు వేదిక

రైతు వేదికలకు మహర్దశ

- దృశ్య, శ్రవణ కేంద్రాలుగా రైతు వేదికలు
- సేవల విస్తరణ, అధికార కార్యక్రమాల నిర్వహణకు కసరత్తు
- ప్రతీ మండలంలో రైతు నేస్తం ఏర్పాటుకు చర్యలు
- జిల్లాలో మూడు వేదికల్లో నిర్వహణ.. మరో 9 ఎంపిక
- ట్రయల్ రన్ నిర్వహణ.. త్వరలో సేవలు ప్రారంభం

జఫర్‌గడ్, జూలై 18 : రైతు వేదికలను మరింత పటిష్టవంతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతు వేదికలను ప్రస్తుత ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తోంది. ప్రభుత్వం చేపట్టిన రైతు నేస్తం ద్వారా దృశ్యశ్రవణ విధానంలో అన్నదాతలకు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలచే సూచనలు, సలహాలు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా తొలి విడత రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున రైతు వేదికలను ఎంపిక చేసి సాంకేతిక పరిజ్ఞానంతో దృశ్య శ్రవణం ద్వారా రైతు నేస్తం కార్యక్రమాలను ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నారు.. ఇవి విజయవంతంగా సాగుతూండడంతో ఈ వీడియో కాన్ఫరెన్స్ సేవలను మరింతగా విస్తరించేందుకు సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు ప్రతి మండలంలో ఒకటి చొప్పున రైతులకు అనువుగా ఉండే రైతు వేదికలను ఎంపిక చేసి రైతు నేస్తం కార్యక్రమాల అమలుకు ఆదేశాలు జారీ చేసింది.

అయితే తొలి విడత జిల్లాలో ఇప్పటి వరకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున మూడు (గానుగపహాడ్, ఛాగల్, కొడకండ్ల) రైతు వేదికల్లో ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో తాజాగా రెండో విడతగా ప్రతి మండలానికి ఒకటి చొప్పున మరో 9 మండలాల్లోని రైతు వేదికలను ఎంపిక చేసి రైతు నేస్తం ద్వారా వీడియో కాన్ఫరెన్స్ సేవలను చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎంపిక చేసిన ఒక్కో రైతు వేదికకు ప్రభుత్వం రూ.3.70 లక్షల చొప్పున నిధులను మంజూరు చేయగా, ఆయా రైతు వేదికల్లో సాంకేతిక పరికరాలను బిగించారు. కేంద్రాల్లో మంగళవారం ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. త్వరలోనే రైతు నేస్తం కార్యక్రమాలు ప్రారంభమవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రతి మంగళవారం రైతులకు సూచనలు..

ప్రతి మంగళవారం ఉదయం 10 నుంచి 11-30 గంటల వరకు దృశ్య శ్రవణ కార్యక్రమం ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు రైతులు పంటల ఉత్పత్తి, సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల నివారణ, ఎరువుల వినియోగం, వివిధ పంటల సాగు, రైతు భరోసా, రైతు బీమా వంటి అంశాలపై సలహాలు, సూచనలు చేస్తారు. ప్రస్తుతం వానాకాలంలో సాగు పనులు ప్రారంభమైనందున ఈ కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగపడనున్నాయి. పంటలకు ఏదేని తెగుళ్లు సోకితే వాటి నివారణ, పంటల సాగు, విత్తనాల ఎంపిక, ఎరువుల వాడకం వంటి అంశాలపై గతంలో గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు ఇచ్చేవారు. ప్రస్తుతం రైతు వేదికల్లో ఆధునిక సాంకేతిక వ్యవస్థ అందుబాటులోకి రావడంతో వ్యయసాయం, అనుబంధ శాఖల సమాచారాన్ని సులభంగా తెలుసుకునే అవకాశం కలిగింది.

రెండో విడత ఎంపికైన రైతు వేదికలు..

తొలివిడత జిల్లాలోని మూడు శాసనసభ నియోజకవర్గాల్లోని జనగామ మండలం గానుగపహాడ్, స్టేషన్ ఘన్‌పూర్ మండలం చాగల్, పాలకుర్తి నియోజకవర్గంలోని కొడకండ్ల మండల కేంద్రంలో ఒక్కొక్కటి చొప్పున మూడు రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. రెండో విడత జిల్లాలోని మిగతా 9 మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున దృశ్య శ్రవణ కేంద్రాలుగా రైతు వేదికలను ఎంపిక చేశారు. జఫర్‌గడ్, పాలకుర్తి, బచ్చన్నపేట, నర్మెట మండలంలోని హన్మంతాపూర్, తరిగొప్పుల, దేవరుప్పులలోని నీర్మాల, చిలుపూర్‌లో లింగంపల్లి, రఘునాథపల్లి, లింగాలఘనపురంలోని సిరిపురం వేదికలు ఎంపికయ్యాయి.

జిల్లాలో 62 రైతు వేదికలు..

గత ప్రభుత్వం క్లస్టర్ల వారీగా ప్రతి 5 వేల జనాభాకు ఒకటి చొప్పున.. ఒక్కొక్క భవనాన్ని రూ.20 లక్షల వ్యయంతో జిల్లాలో 62 రైతు వేదికల భవనాలను నిర్మించడంతో పాటు ఏఈఓలను నియమించింది. స్థలాల కొరత కారణంగా చాలా చోట్ల దూరపు ప్రాంతాల్లో నిర్మాణాలు చేశారు. ప్రారంభంలో వీటి నిర్వహణకు గాను ప్రభుత్వం నెలకు రూ.9 వేలు చొప్పున అందించారు. తదనంతరం వాటి నిర్వహణ ఖర్చులు ఇవ్వకపోవడం, రైతులకు సౌకర్యంగా లేకపోవడం, రైతులతో శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వంసాంకేతికత జోడించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయం, పంటలపై శాస్త్రవేత్తలచే రైతులకు సలహాలు, సూచనలతో రైతు వేదికలను వినియోగంలోకి తీసుకురావాలని సంకల్పించి కార్యాచరణ అమలుకు శ్రీకారం చుట్టింది.

రైతులకు ఎంతో ప్రయోజనకరం..

- పుల్లోజు వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, జనగామ



ప్రభుత్వం మండలానికో రైతు వేదికను దృశ్య శ్రవణ కేంద్రంగా ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. పంటల సాగులో ఎప్పటికప్పుడు అవగాహన పెరుగుతుంది. పంటల ఉత్పత్తిలో సందేహాలను శాస్త్రవేత్తలతో నేరుగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి నివృత్తి చేసుకోవచ్చు. రైతులు - శాస్త్రవేత్తలకు మధ్య అనుసంధానంగా రైతు నేస్తం దోహద పడుతుంది. ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తం ద్వారా పంటలకు సంక్రమించే తెగుళ్లు, వాటి నివారణ, దిగుబడులకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు, పంటల సాగులో మెళకువలు, వంటి అంశాలపై ఎప్పటికపుడు సలహాలు, సూచనలతో తాజా సమాచారాన్ని పొందవచ్చు.

తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేస్తాం

బీజేపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి చంద్రశేఖర్‌జీ



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి చంద్రశేఖర్‌జీ

జనగామ రూరల్, జూలై 18: బీజేపీ రాబోయే కాలంలో తెలంగాణలో కాషాయ జెండాను ఎగురవేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి చంద్రశేఖర్‌జీ, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ధీమ వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అరుట్ల దశమంత్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి చంద్రశేఖర్‌జీ, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిలు హాజరై మాట్లాడుతూ 2029లో జరిగే అసెంబ్లీ ఎన్నికలల్లో బీజేపీ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు కలిసి కట్టుగా పని చేయాలన్నారు.పార్లమెంట్ ఎన్నికల పలితాలలో బీజేపీ కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటి ఇవ్వడం జరిగిందని అదే విధంగా రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ బలం చూపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్ రెడ్డి, ఉడుగుల రమేష్, లేగ రామ్మోహన్, శివరాజ్ యాదవ్, కొంతం శ్రీనివాస్, హరిచంద్రగుప్త, పిట్టల సత్యం, పవన్‌శర్మ, అనిల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

జనగామ రూరల్, జూలై 18: యవత చెడు అలవాట్లకు బానిసై బంగారు భవిష్యతును నాశనం చేసుకోకూడదని జనగామ డీసీపీ రాజమహేంద్ర అన్నారు. జనగామ పోలీస్ స్టేషన్‌లో గురువారం డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి డీసీపీ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు గాలిలో కలిసి పోతాయని వారి కుటుంబ సభ్యులు రోడ్డు పడుతారన్నారు. మద్యం సేవించి వాహనాలు నిడిపిన, ట్రాఫిక్ నియమాలు పాటించకపోయిన చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లీదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలను ఇవ్వకూడదని, రాత్రి పది దాటితే ఇంటి నుండి బయటకు వెళ్లకుండా చూడలని సూచించారు.

కార్యక్రమంలో జనగామ ఇన్‌చార్జి ఏసీపీ పార్థసారథి, సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సైలు తిరుపతి, సృజన్, శ్వేత, కేశవులు, పాల్గొన్నారు.

అఖండ హరినామ సంకీర్తనకు కట్కూరు బృందం..



తిరుమలలో హరినామ సంకీర్తనలో పాల్గొనేందుకు వెళుతున్న భజనమండలి సభ్యులు

బచ్చన్నపేట, జూలై 18:జానపద కళలను పరిరక్షించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తోంది. హిందూధర్మ ప్రచారంతో పాటు, వాగ్గేయకారుల కీర్తనలను ఆలపిస్తూ, జానపద శైలిలో భజనలు చేసేందుకు ప్రతియేడు తిరుమలలో జరిగే అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొనేందుకు మండలంలోని కట్కూరు శ్రీ శివరామకృష్ణ భజన మండలి సభ్యులు హాజరవుతారు. భజన కార్యక్రమాలు నిర్వహించి, కీర్తనలు ఆలపిస్తారు. ఈ నెల 20న జరిగే హరినామ సంకీర్తనకు భజనమండలికి చెందిన 18 మంది సభ్యుల బృందం గురువారం తిరుపతికి బయలుదేరి వెళ్లారు. సభ్యులకు వసతి, బోజనం, దర్శనం టీటీడీ కల్పించనుంది. తిరుమల త్యాగరాయగాన సభలో ఈ కార్యక్రమం జరగనుంది. ఇలాంటి మహత్తర కార్యక్రమంలో పాల్గొనే అవకాశం తమకు దక్కటం పూర్వజన్మ సుకృతమని భజనమండలి సభ్యులు చింతల బాలయ్య, ముసిని బాబు, పోలోజు రాంబ్రహ్మాచారి, బైరగోని కనకయ్యగౌడ్, కనకాచారి, రెడ్డెం విదేయ్‌కుమార్, ముశిని బానుచందర్, ముశిని మహేశ్, గర్దాసు వెంకటేశ్వర్లు, సాయికుమార్, గంజి గోపాల్, వి శ్రీనివాస్, సత్యనారాయణ, రాంరెడ్డి, బుచ్చయాచారి, దామోదర్‌లు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



సాంబరాజు (ఫైల్)

నర్మెట, జూలై 18 : వ్యవసాయం చేయడానికి తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపంతో యువరైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన సంఘటన జనగామ జిల్లా నర్మెట మండలంలోని కన్నెబోయినగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కన్నెబోయినగూడెం గ్రామానికి చెందిన తోడేటి సాంబరాజు(29) గ్రామంలో తనకున్న మూడున్నర ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. అప్పులు తెచ్చి భూమిని చదును చేసి బోర్లు వేశాడు. దీంతో రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. పంట దిగుబడి రాక అప్పులు తీరలేదు. దీంతో అప్పులు ఎలా తీర్చా లని మనస్తాపం చెంది ఈ నెల 16న గ్రామ శివారు లోని పైపు లైన్ వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

అంతర్ జిల్లా దొంగను పట్టుకున్న పోలీసులు

- రూ.1.62 లక్షల విలువైన వెండి, బంగారం స్వాధీనం
- టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్

మహబూబాబాద్ రూరల్, జూలై 18 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం మహర్షి స్కూల్ వద్ద వాహనాల తనిఖీల్లో గురువారం అంతర్‌జిల్లా దొంగను పట్టుకున్నట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ మండలం దర్గాతండాకు చెందిన కోట్ల ముత్యాలరావు పల్సర్ బైక్‌పై వస్తుండగా పట్టణ శివారులో వాహనాల తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నంచేశాడు. ఇదిగమనించిన పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకోగా నెంబర్‌ప్లేట్ లేని పల్సర్‌బైక్ ఉన్నట్లు గుర్తించారు. అది స్వాధీనం చేసుకుని విచారించగా గతంలో ముత్యాలరావు పలు దొంగతనాల కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లినట్లు చెప్పారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత పలుచోట్ల దొంగతనాలు చేసినట్లు నేరం ఒప్పుకున్నాడు. నెహ్రూసెంటర్‌లోని ఓ బైక్‌తో పాటు పట్టణంలోని పలు కాలనీల్లో దొంగిలించిన బంగారం, వెండి, సెల్‌ఫోన్‌లను అపహరించినట్లు పేర్కొన్నారు. సుమారు వాటి విలువ రూ.1.62 లక్షలు ఉంటుందని చెప్పారు. వాటిని విక్రయించేందుకు మహబూబాబాద్‌కు వస్తున్న క్రమంలో వాహనాల తనిఖీలో పట్టుబడినట్లు పేర్కొన్నారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న టౌన్ ఎస్సై విజయ్‌కుమార్, క్రైమ్ సిబ్బందిని, డీఎస్పీ తిరుపతిరావును ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్ అభినందించారు.

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

వివరాలు 7వ పేజీలో



శ్రీపతిపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఎర్రజెండాలను నాటి, ముళ్ల పొదలను శుభ్రం చేస్తున్న సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ భూములను పంచాలి

- సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్
- శ్రీపతిపల్లి ప్రభుత్వ భూముల సందర్శన

చిలుపూర్, జూలై 18 : అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ భూములను పంచాలని సీపీఐ పార్టీ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల మల్లేషం అధికారులను డిమాండ్ చేశారు. మండ లంలోని శ్రీపతిపల్లి గ్రామ రెవెన్యూ సర్వేనంబర్ 70 పరిధిలోని 46. 21 ఎకరాల ప్రభుత్వ భూమిని గురువారం ఆయన సందర్శించారు. ఎర్రజెండాలు పాతి నినాదాలు చేపట్టారు. దున్నేవానికే భూమి అంటూ నినదించారు. అనంతరం గ్రామానికి చెందిన పేదలు, సీపీఐ నాయకులతో కలిసి పలుగు, పార పట్టి ముళ్ళ పొదలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా బాల మల్లేషం మాట్లాడుతూ శ్రీపతిపల్లిలో ఉన్న ప్రభుత్వ భూములను అర్హులైన నిరుపేద కుటుంబాలకు పంచాలని డిమాండ్ చేస్తూ, సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో గత ఐదేళ్ళుగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. భూపంపిణీ కోసం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీతో పాటు, అర్హులైన రైతులతో కూడిన జాబితాను సైతం చిలుపూర్ మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌కు అందజేశామన్నారు. అధికారులు వెంటనే స్పందించి పేదరైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి పైస రాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు మోతె లింగారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న సీపీఐ మండల సహాయ కార్యదర్శి బోనగిరి కుమారస్వామి, కట్ట ఎల్లయ్య, దామెర సంపత్, బీకేఎంయూ మండల ప్రధాన కార్యదర్శి పిట్టల కుమార్, గ్రామ కమిటీ నాయకులు ఆకోజు రవిందర్, రొయ్యల రాజు, మహిళ నాయకురాలు పాతూరి సుగుణమ్మ, రాధమ్మ, రాధిక, సరస్వతి, లక్ష్మి, అయిలమ్మ, సముద్రాల రాజు, పిట్టల కుమారస్వామి, ఆవుల గణేశ్, వాజ్‌పేయి, రవిందర్, పంగ రాంచందర్, ఇరుగు నర్సయ్య, పిట్టల అంజయ్య, ఇరుగు రాజయ్య, తండ రాజు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



అటవీ శాఖలో బదిలీలు

వరంగల్ క్రైం, జూలై 18: భద్రాద్రి కొత్తగూడెం జోన్ పరిధిలోని అటవీ శాఖలో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. గురువారం హనుమకొండ అటవీ శాఖ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. జోన్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో జరిగిన బదిలీల్లో 106 మంది స్థాన చలనం చెందారు. బదిలీ అయిన వారిలో 27 డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, 53 సెక్షన్ ఆఫీసర్లు, 19 సీనియర్ అసిస్టెంట్లు, 7 సూపరింటెండెంట్లు ఉన్నారు.



నేడు ఒకేషనల్ కళాశాలలో జాబ్‌మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వృత్తి విద్యా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్, జూలై 18: ఈనెల 19న హనుమకొండ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో 2021-22, నుంచి 2023-24లో ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు అప్రెంటిషిప్ జాబ్‌మేళా-2024 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బెడుదం శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కళాశాల అవరణలో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.7చొప్పున ఆర్‌డీఎస్‌డీ సంస్థ వారు శిక్షణకాలంలో ఇస్తారని పేర్కొన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులందరూ రెండు జతల బయోడెటాతోపాటు రెండు ఫొటోలు, ఇంటర్, ఎస్సెస్సీ, ఆధార్‌కార్డుతోపాటు ఇతర విద్యార్హతల ధృవపత్రాలను తీసుకునిరావాలని సూచించారు. జాబ్‌మేళా కళాశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఉదయం సెషన్‌లో పారామెడికల్, సాయంత్రం సెషన్‌లో ఇంజనీరింగ్, కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అప్రెంటిషిప్ సాగుతుందని స్పష్టం చేశారు. కాగా, విద్యార్థులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని డీఐఈఓ ఎ.గోపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వృత్తి విద్యాకళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ పి.దివాకర్, ఎన్‌ఎస్‌ఎఫ్ పీవో డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఎస్.శ్రీనివాస్, అధ్యాపకులు ఎం.విష్ణుకాంత్, ఎం.రాజేంద్రప్రసాద్, పి.విజయకుమార్, ఎ.దిలీప్, ఖాదర్‌బాబా, డి.రవి, చౌహాన్, మహేందర్, జయపాల్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రిటైర్డు ప్రొఫెసర్ సుభాష్ మృతి

నివాళులర్పించిన ప్రొఫెసర్లు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, జూలై 18: కాకతీయ యూనివర్సిటీ బయో టెక్నాలజీ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ కారంపూడి సుభాష్ (76) గుండెపోటుతో మృతి చెందారు. గత 16న హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడివగా దుబ్బాకలోని తన స్వగృహంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు సభ్యులు తెలిపారు. సుభాష్‌కు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.

1970లో వర్సిటీలో లెక్చరర్‌గా ఉద్యోగంలోకి చేరిన సుభాష్. ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. వర్సిటీలో బాటనీ, బయోటెక్నాలజీ విభాగంలో బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా, వర్సిటీ అభివృద్ధి అధికారిగా, వసతి గృహాల సంచాలకుడిగా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ప్రొఫెసర్ సుభాష్ కేయూ పూర్వపు వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ జాఫర్ నిజాం పర్యవేక్షణలో డాక్టరేట్ సాధించారు. మృతి చెందిన ప్రొఫెసర్ సుభాష్ మృతికి సంతాపంగా గురువారం కేయూ బయో టెక్నాలజీలో విభాగాధిపతి డాక్టర్ శాస్త్రి తాడూరి నేతృత్వంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ నూనె రామస్వామి, ప్రొఫెసర్ సదానందం, డాక్టర్ పొడేటి శ్రీనివాస్, ప్రొఫెసర్ క్రిష్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.







మొగిళిచర్లలో అనధికారిక లేఔట్ తొలగింపు

వరంగల్ కార్పొరేషన్, జూలై 18: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ మొగిళిచెర్ల శివారులో సర్వే నెంబర్ 178/2సి, 179సిలో మూడెకరాల విస్తర్ణంలో ఉన్న వ్యవసాయ భూమిలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఔట్ ప్లాట్ల హద్దు రాళ్లను గురువారం బల్దియా అధికారులతో పాటు డీఆర్‌ఎఫ్ సిబ్బంది తొలగించారు. అనుమతి లేకుండా ప్లాట్లు చేసినందుకు గాను లేఔట్‌ను తొలగించినట్టు ఏసీపీ ఖలీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీబీవో ఖాజాషరీఫ్, చైన్‌మెన్ ప్రశాంత్‌తో పాటు డీఆర్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

21న సింగర్ సనశ్రీ 8 గంటల నాన్‌స్టాప్ పాటలు

వడ్డెపల్లి, జూలై 18: హనుమకొండ న యీంనగర్‌లోని వాగ్దేవి కాలేజీలో ఈనెల 21న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 108 పాటలను నిరంతరంగా సింగర్ సనశ్రీ ఆలాపించనున్నట్లు కాకతీయ మ్యూజికల్ క్లబ్ సభ్యులు తెలిపారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సింగర్ సనశ్రీ మాట్లాడుతూ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ , తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఈ మూడు బుక్స్‌రికార్డ్స్ కోసం 108 మల్టీ లాంగ్వేజ్ పాటలను నాన్‌స్టాప్‌గా 8 గంటల పాటు ఆలాపించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో తోట పూర్ణచందర్‌రావు, సిరాజొద్దీన్, తిరుపతయ్య, రంగు రఘుపతి, రాంమూర్తి, శ్రీమన్నారాయణ పాల్గొనున్నారు.









పరీక్షలు ముగిసిన విద్యార్థులు హాస్టల్ ఖాళీ చేయాలి..

కేయూ క్యాంపస్, జూలై 18: కాకతీయ యూనివర్సిటీలో తాజాగా పీజీ రెండో ఏడాది పరీక్షలు ముగిసిన విద్యార్థులు జూలై 20వ తేదీలోగా హాస్టళ్లు ఖాళీ చేయాలని కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖాళీ చేసిన విద్యార్థులు హాస్టల్ గదుల తాళాలను కేర్‌టేకర్లు అప్పగించాలని స్పష్టం చేశారు. వర్సిటీ ఆదేశాలు పాటించని విద్యార్థుల గదులను స్వాధీనం చేసుకుని వర్సిటీ అధికారులే తాళాలు వేస్తామని పేర్కొన్నారు. తర్వాత వర్సిటీలో తలెత్తేపరిణామాలకు సిబ్బంది బాధ్యత ఉండదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 18: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాల దరఖాస్తుల గడువును ఈ నెల 21 వరకు పొడిగించినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ జి.సక్రు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు http://iti.telangana.gov.in వెబ్‌పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 18: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయురాలికి కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో వాసంతి షోకాజ్ నోటీసు జారీ చేశారు. హనుమకొండలోని వడ్డెపల్లి ఉర్దూ మీడియం ప్రైమరీ పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసియా సిద్ధిఖి అనే ఉపాధ్యాయురాలు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నట్లు గుర్తించారు. వర్క్ బుక్‌లను ఉపయోగించకపోవడం, విద్యార్థులకు వర్క్ బుక్స్‌ను ఇవ్వకపోవడం, పాఠశాల మౌలిక వసతులు పట్ల అవగాహన రాహిత్యాన్ని గుర్తించిన కలెక్టర్ ప్రావీణ్య.. ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించడంతో డీఈవో డి.వాసంతి ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వరంగల్ మెడికల్, జూలై 18: షుగర్, గుండెవ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 19న శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ ఇ.లక్ష్మణ్ కుమార్, కార్డియాలజిస్టు డాక్టర్ పీవీ అనిల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పద్మాక్షి పాలిక్లినిక్‌లో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.5వేల విలువైన పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతోపాటు, మరో రూ.1500 విలువైన రెటినోపతి కంటి పరీక్షను సైతం ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 9955996166, 91338933లలో సంప్రదించాలన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

న్యూశాయంపేట, జూలై 18: కుల గణన చేపట్టి రిజర్వేషన్లు పెంచిన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన సమగ్ర కుల గణన యాత్ర సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీలు దూరం కావడంతోనే గత ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ తగ్గిందని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరిచి బీసీలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. బీసీలుఅంటే బ్రిలియంట్ క్యాస్ట్ అని.. బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదన్నారు. బీసీలకు ఉన్న తెలివి ప్రపంచంలో ఎవరికీ లేదని, దమ్ము ధైర్యం ఉన్న కులం బీసీ కులం అన్నారు. గత శాసనసభఎన్నికల ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 6 నెలల్లోపు కులగణన చేపడతామని చెప్పారని, ఆ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. కులగణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బీసీలు పోరాటం చేస్తారని హెచ్చరించారు.

ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భైరి రవికృష్ణ గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శ్యామ్ కుర్మా, బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు విక్రమ్ గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మణి మంజరి, బీసీ కులాల జేఏసీ రాష్ట్ర నాయకులు కుందారపు గణేష్‌చారి, బాలగాని బాలరాజు గౌడ్, సగర శేఖర్, వడ్నాల నరేందర్, డాక్టర్ చిర్ర రాజు, బీసీ సంక్షేమ సంఘం చిల్పూర్ మండల అధ్యక్షుడు బత్తుల రాజన్‌బాబు, దాడి మల్లయ్య, నాగరాజు, శోభారాణి, పద్మజతో పాటు పెద్ద సంఖ్యలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కరుణకు విజ్ఞప్తి



వాకాటి కరుణకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి తదితరులు

హనుమకొండ సిటీ, జూలై 18: అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఉద్యోగ విరమణ తరువాత లభించే ఆర్థిక ప్రయోజనాల అమలుకు సంబంధించిన ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాకాటి కరుణకు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి, ప్రధాన కార్యదర్శి రమాతార విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లో వాకటి కరుణను కలిసి అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, కేంద్రాలకు సంబంధించిన సమస్యల పరిష్కార చర్యలను చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. రిటైర్మెంట్ అయిన టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయలను ప్రభుత్వం అందచేయనున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలియచేశారు. అయితే ఇందుకు సంబంధించిన జీవోను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. అనారోగ్య సమస్యలతో ఉన్న టీచర్లు, హెల్పర్లకు వాలంటరీ రిటైర్మెంట్ ఇవ్వాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, టీచర్లకు అదనపు పనులు అప్పగించరాదని, కేంద్రాల్లో వసతులు కల్పించాలనే తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి వేదవతితో పాటు ఎల్లమ్మ, శిరీష, పుష్ప, నాగలక్ష్మి, చిన్నమ్మడు, అనిత తదితరులు పాల్గొన్నారు.

అడవి జంతువుల కోసం 'వేట'కుక్కలు..



ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల వేటగాళ్లు విచ్చలవిడిగా అడవి జంతువులను మట్టుబెట్టి యథేచ్ఛగా వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు అడవి జంతువుల కోసం ఉచ్చులు బిగిస్తుంటే.. మరికొందరు విద్యుత్ వైర్లు అమరుస్తున్నారు. ఇంకొందరైతే ఏకంగా వేటకుక్కలను వినియోగిస్తూ అడవి జంతువులను వేటాడుతున్నారు. గురువారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం పల్లెగుట్ట సమీపంలో కొందరు వేటగాళ్లు అడవి జంతువుల ఇదిగో ఇలా సుమారు పది కుక్కలను వదలగా.. అవి పొలాలను జల్లెడపడుతూ కనిపించాయి. అయితే అటవీ అధికారులు స్పందించి వేటగాళ్లను కట్టడి చేసి అడవి జంతువులను కాపాడాలని జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ



హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో శిశువు రగడ

మగ శిశువుకు బదులు, ఆడ మృత శిశువునిచ్చారని బంధువుల ధర్నా

వరంగల్ మెడికల్, జూలై 18: తమకు మగ శిశువు పుడితే చనిపోయిన ఆడ శిశువును ఇచ్చారని తల్లిదండ్రులు హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన అనూష. బుధవారం ప్రసవం కోసం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో చేరారు. వైద్యులు ప్రసవం చేశారు. అయితే చనిపోయిన ఆడ శిశువుడును ఇచ్చారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తమకు మగశిశువు పుట్టాడని, ఈ స్థానంలో చనిపోయిన ఆడ శిశువును ఇచ్చారని కన్నీటిపర్యంతం అయ్యారు. వివాహ అనంతరం ఏడేళ్ల తర్వాత గర్భం ధరించిందని, ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే ఇలా చేశారని ఆరోపిస్తున్నారు. కాగా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు అనుమానం ఉంటే డీఎన్‌ఏ పరీక్షలకైనా తాము సిద్ధమే అన్నారు. కుటుంబసభ్యులకు ముందుగానే సమాచారం ఇచ్చామని వివరించారు.

గంగదేవిపల్లిని సందర్శించిన విదేశీ బృందం



గంగదేవిపల్లిని సందర్శించిన విదేశీబృందం

గీసుగొండ, జూలై 18: జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఇటలీ, సిసిలియా, ఏర్రిత్రియా దేశాలకు చెందిన ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. బాలవికాస సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 2 వారాల పాటు కమ్యూనిటీ డ్రీవెన్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన విదేశీ బృందం ఫీల్డ్‌విజిట్‌లో గంగదేవిపల్లిని సందర్శించినట్లు జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి తెలిపారు. ఈ సందర్భంగా వారికి గ్రామాభివృద్ధిలో ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం, గ్రామాభివృద్ధి కమిటీల పనితీరును, సాధించిన అవార్డులు, నగదు పురస్కారాలను రాజమౌళి వివరించారు. కార్యక్రమంలో బాలవికా స సంస్థ డైరెక్టర్ సింగారెడ్డి సునీత, ఆశలత, సుజాత, దీప, రిసోర్స్ పర్సన్స్ గూడ సరోజన, వితంతువుల కమిటీ అధ్యక్షురాలు మేడిద సుశీల పాల్గొన్నారు.

భద్రత చెక్కు అందించిన సీపీ



చెక్కు అందిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, జూలై 18: గత నెలలో అనారోగ్యంతో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ రాజు కుటుంబానికి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా రూ.7లక్షల 89వేల భద్రత చెక్కును అందచేశారు. గురువారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో రాజు సతీమణి మాధవికి కమిషనర్ చెక్కు అందించారు. వారి కుటుంబ సభ్యుల పరిస్థితిని తెలుసుకున్న కమిషనర్.. మిగతా బెనిఫిట్స్ తొందరగా అందించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో పరిపాలన విభాగం ఏవో రామకృష్ణ స్వామి, సెక్షన్ సూపరింటెండెంట్ జలజ, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్ తదితరులు పాల్గొన్నారు.

సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా షర్మిల

ఆర్ఎంవోగా యాకుబ్ పాషా.. బదిలీపై రానున్న వైద్యులు

గిర్మాజిపేట, జూలై 18: వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి.షర్మిల, ఆర్ఎంవోగా డాక్టర్ యాకుబ్ పాషాలు నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ బదిలీల్లో ప్రొఫెసర్ కేడర్‌లో ప్రస్తుత సీకేఎం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గైనకాలజీ అండ్ అబ్‌స్ట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ టి.నిర్మలాకుమారి.. నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు బదిలీ అయ్యారు. హైదరాబాద్ గాంధీ వైద్య కళాశాలలో గైనకాలజీ అండ్ అబ్‌స్ట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ జి.షర్మిల వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. అలాగే డిప్యూటీ సివిల్ సర్జన్ కేడర్‌లో ప్రస్తుత సీకేఎం ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ శ్యామ్ కుమార్ జనగామ డీఎంహెచ్‌వో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో హనుమకొండ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ యాకుబ్ పాషా ఆర్ఎంవోగా వస్తున్నారు. అలాగే సివిల్ అసిస్టెంట్ సర్జన్ కేడర్‌లో సీకేఎం ఆస్పత్రి రేడియాలజీ డాక్టర్ రాంబాబు దామెర పీహెచ్‌సీకి, డాక్టర్ వై.వనజ హసన్‌పర్తి పీహెచ్‌సీకి, పీపీ యూనిట్ డాక్టర్ శ్రీదేవి కడిపికొండ పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. కాగా, సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి రేడియోగ్రాఫర్ సిద్ధార్థ 40 శాతం బదిలీల్లో లేకపోవడంతో గురువారం జరిగిన కౌన్సెలింగ్‌లో సీకేఎం ఆస్పత్రిలోనే యథావిధిగా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నర్సింగ్ అధికారులు, శనివారం ఫార్మసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లకు బదిలీ కౌన్సెలింగ్ జరగనుంది.

21న జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్

వరంగల్ స్పోర్ట్స్, జూలై 18: వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈ నెల 21న హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చీఫ్ ఆర్బిటర్ చిన్న రాముల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న ప్రపంచ చదరంగం(చెస్) దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లాల స్థాయిలో అండర్-7, 9, 11, 13 బాలబాలికల విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు శుక్రవారం టీటీడీ కల్యాణ మండపంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9963214108 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన డీఎస్సీ పరీక్ష

మొదటి సెషన్‌లో 89.6, రెండో సెషన్‌లో 89.13 శాతం మంది హాజరు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 18: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీ-2024 జిల్లాలో గురువారం నుంచి ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలో 5 పరీక్ష కేంద్రాల్లో సీబీటీ పద్ధతిలో నిర్వహిస్తున్న పరీక్ష ప్రశాంతంగా ప్రారంభమైంది. మొదటి రోజు ఉదయం పూట సెషన్‌లో 1,206 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 1,038 మంది హాజరు కాగా 168 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పూట నిర్వహించిన రెండో సెషన్‌లో ఒకే ఒక సెంటర్‌లో 138 మంది అభ్యర్థులకు గాను 123 మంది హాజరయ్యారు. మొదటి రోజు తొలి సెషన్‌లో 89.6 శాతం, మలి సెషన్‌లో 89.13 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం పూట సెషన్‌లో చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ పరీక్ష కేంద్రంలో 102 మంది, అయాన్ డిజిటల్ సెంటర్‌లో 216, జయ ఇనిస్టిట్యూట్ కేంద్రంలో 210, మోక్షిత సెంటర్‌లో 387, నోబెల్ టెక్నాలజీస్ సెంటర్‌లో 153 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మధ్యాహ్నం పూట సెషన్‌లో అయాన్ డిజిటల్ కేంద్రంలో 123 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు స్థానిక నిర్వాహకురాలు డి. వాసంతి తెలిపారు.

యాప్, వెబ్ సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేలా అవగాహన కల్పించాలి..

హనుమకొండ టౌన్, జూలై18 : టీజీ ఎన్పీడీసీఎల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని నోడల్ ఆఫీసర్లను సీఎండీ ఆదేశించారు. గురువారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో నోడల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో ఏ విధంగా బిల్లు చెల్లించేలా అనే దానిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌లో భాగంగా ఫీడర్లపై అంతరాయాలను తగ్గించడానికి ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఏబీ స్విచ్‌లు మరమ్మతులు చేసుకొని, వాటిని ఓపెన్ చేసుకొని పని చేయడం ద్వారా అంతరాయాలు తగ్గుతాయన్నారు. ప్రతీ సర్కిల్‌లో ఇలా చేయడం ద్వారా అంతరాయాలు కనిష్టస్థాయికి తగ్గుతాయన్నారు. విద్యుత్ అంతరాయాలపై ఎప్పటికప్పుడు కిందిస్థాయి సిబ్బందికి మార్గనిర్దేశం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, సీజీఎంలు తిరుమల్‌రావు, కిషన్, రాజుచౌహాన్, కె.ఎస్.గుప్త, జీఎంలు గౌతమ్‌రెడ్డి, నాగప్రసాద్, వేణుబాబు, దేవేందర్, మాధవరావు, అన్నపూర్ణ, డీఈ (టి) శ్రీధరాచారి తదితరులు పాల్గొన్నారు.



ములుగులో బాణాసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు



లింగాల ఘనపురంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య

మాఫీ జరిగె.. పండుగ వచ్చే..



మహబూబాబాద్ రైతువేదికలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి

దేవరుప్పులలో పొలం వద్ద రైతులు, కాంగ్రెస్ నాయకుల సంబురాలు





హనుమకొండలోని డీసీసీబీ కార్యాలయం ఎదుట జరిగిన సంబరాల్లో డప్పు కొడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

ఎన్నికల హామీగా కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన మాట మేరకు రూ.2లక్షల రుణమాఫీకి శ్రీకారం చుట్టింది. గురువారం రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేస్తూ 'రుణమాఫీ పండుగ' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ క్రమంలో గ్రామాల్లో సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు చిత్రపటాలు, ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యేలు, నేతలు ర్యాలీలు.. ఎద్దులబండ్లతో ఊరేగింపులు నిర్వహించారు. బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా రైతులు కూడా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక రైతువేదికల్లో జరిగిన కార్యక్రమాలకు హాజరైన రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి అయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సీఎంతో మాట్లాడి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



భూపాలపల్లి జిల్లా చిట్యాలలో జరిగిన ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



తొర్రూరు మండలం మాటేడులో ఎద్దులబండిపై నుంచి రైతులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి



ఆత్మకూరు మండలం హౌజ్‌బుజుర్గ్ గ్రామంలో బైకు ర్యాలీలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



సీఎం రేవంత్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రైతు ఎల్లయ్య

మీకు రుణపడి ఉంటాం..

రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తాం

సీఎం రేవంత్‌తో బొల్లికుంట రైతు ఎల్లయ్య

శంభునిపేట, జూలై 18: రైతులకిచ్చిన మాట నిలుపుకొన్న సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటామని వరంగల్‌లోని ఉర్సు ప్రాంతానికి చెందిన రైతు బొల్లు ఎల్లయ్య అన్నారు. రుణమాఫీ సందర్భంగా గురువారం ఖిలావరంగల్ మండలం బొల్లికుంటలో పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడగా అందులో భాగంగా వరంగల్‌కు చెందిన రైతు బొల్లు ఎల్లయ్య మాట్లాడుతూ.. రైతులకు ఒకే విడతలో రుణమాఫీ చేసి రైతులకు మేలు చేసిందని, సీఎంతో చెప్పారు. జోడో యాత్ర సభలో భాగంగా వరంగల్‌లో నిర్వహించిన సభలో ఇచ్చిన డిక్లరేషన్ మేరకు రైతు రుణమాఫీ చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. తాము రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తామని, ఆయన్ను వరంగల్‌కు మళ్లీ తీసుకురావాలని రేవంత్ రెడ్డిని కోరారు. అందుకు స్పందించిన సీఎం రేవంత్... రైతు రుణమాఫీ వరంగల్ డిక్లరేషన్‌లోనే చెప్పామని అధికారంలోకి వచ్చి చేశామని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీని వరంగల్ తీసుకొస్తే సభను విజయవంతం చేస్తారా అని ఎల్లయ్యను అడుగగా.. 5లక్షల మంది రైతులను తీసుకువస్తాం అని ఎల్లయ్య సమాధానం ఇచ్చారు.


స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం, ఎంపీ కావ్య


గానుగుపహాడ్‌లో క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ చామల కిరణ్‌రెడ్డి


లింగాలఘణపురంలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు


తరిగొప్పులలో రేవంత్ చిత్ర పటానికి క్షీరాభిషేకం


చిలుపూర్‌లో కాంగ్రెస్ నాయకుల బైక్ ర్యాలీ

'రుణ' సంబురం

జనగామ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీని వర్తింపచేస్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జనగామ మండలం గానుగుపహాడ్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు రుణమాఫీ సంబురాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రుణమాఫీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ప్రారంభించగా గానుగుపహాడ్ రైతువేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, రైతులతో కలిసి ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్ర, విద్యుత్ శాఖ ఎస్ఈ వేణుమాధవ్, ఏసీపీ పార్థసారథి, సీనియర్ నాయకుల పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం: యశస్విని

పాలకుర్తి : రేవంత్‌రెడ్డిది చేతల ప్రభుత్వమని, గతంలో అధికారంలో ఉన్నది మాత్రం మాటల ప్రభుత్వమని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన రూ. 2 లక్షల రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పర్మార్ పింకేష్‌కుమార్, జెడ్పీ సీఈవో అనిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఝాన్సీరెడ్డి, డీఆర్‌డీవో పీడ మొగులప్ప, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, ఏడీఏ పరశురామ్, ఏఈవోలు ఉన్నారు.

హామీలు నెరవేర్చాం : కడియం

రఘునాథపల్లి: ఎన్నికలలో కాంగ్రెస్ ఇచ్చినహామీ మేరకు అప్పుల ఊబిలో కూరుకపోయిన అన్నదాతలను ఆదుకోవడానికి ఏకకాలంలో రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, రైతు సంక్షేమమే కాంగ్రెస్ సర్కారు లక్ష్యమని వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఏకకాలంలో లక్ష వరకు రైతు రుణమాఫీ నిధుల విడుదల నేపథ్యంలో గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సంబరాలు నిర్వహించారు. సంబరాలలో భాగంగా లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్పీకర్ ప్రసాదరావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ సలహాదారు కేశవరావులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని రైతు రుణ మాఫీ పథకంపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌ను కడియం కావ్య, కడియం శ్రీహరి, సింగపురం ఇందిర అధికారులతో కలిసి వీక్షించారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడారు. అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, డీఏవో వినోద్ కుమార్, ఆర్డీవో కొమురయ్య, మాజీ జడ్పీటీసీలు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి, రాంబాబు, బొల్లం అజయ్ మణికంఠ, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేందర్, ఏవో శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్ యుగేందర్, ఎంపీడీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● బచ్చన్నపేట : కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ కార్యక్రమాన్ని రూ.లక్షతో ప్రారంభించడంతో కాంగ్రెస్ శ్రేణులు,, రైతులు గురువారం మండల కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. బాణాసంచాలు కాలుస్తూ, మిఠాయిలు పంచుకున్నారు. మండల పరిధిలో 2257 మందికి రుణమాఫీ జరిగిం దని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశాలాక్షి, ఏవో విద్యాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కొడకండ్ల : మొదట రైతులకు విడుదల చేసిన కార్యక్రమాన్ని రైతులు పండుగలా నిర్వహించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తదితరులతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో పార్టీలకతీతంగా రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తితో వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో మొదటి విడుతలో 0 నుంచి రూ.లక్ష రుణమాఫీ 909మంది రైతులకు అమలు కానుంది. అంత కు ముందు కాంగ్రెస్‌పార్టీ మండలా ధ్యక్షుడు డి.సురేష్ నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణులు, రైతులు బాణాసంచా కాల్చి అక్కడినుండి రైతువేదిక వరకు ఆటపాటలతో ర్యాలీ నిర్వహించారు. రైతువేదికలో సీఎం రేవంత్ రెడ్డి , ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, ఝాన్సీరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి రైతులకు స్వీట్లు పంచిపెట్టారు. రైతువేదికలో జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్ రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ రవీందర్, ఎంపీడీవో నాగ శేషాద్రి సూరి, డీటీ చంద్రమో హన్, ఏవో విజయ్‌రెడ్డి , పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాస్, ఏఈవోలు నవ్య, కాంగ్రెస్ నాయకులు సురేష్, రాజేష్, మసురం రవీంద ర్, మధుసూదన్, భిక్షపతి, మహేష్ , కె.అమరే ందర్‌రెడ్డి, నాగరాజు, రమేశ్, వంశీ తదితరులు బీఆర్ఎస్ నాయకులు అందె యాకయ్య, ఎల్లయ్య , పొడిశెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

● జఫర్‌గడ్ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ పురస్కరించుకుని జఫర్‌గడ్‌లో గురువారం సంబురాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, శ్రేణులు, మండల కేంద్రానికి చేరుకుని స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గాంధీ సెంటర్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నేతలు, రైతులు పాలాభిషేకం చేశారు. రైతు వేదిక భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని వీడియోకాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని మండల తహసిల్దార్ అంబటి అంజనేయులు, ప్రజా ప్రతినిధులు, ఏఈఓలు, రైతులు, నాయకులు వీక్షించారు. రైతుల పంట రుణమాఫీ నిధులు విడుదలతో ప్రజా ప్రతినిధులు, రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అన్నదాతలు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, తొలి విడత మండలంలోని 2,224 మంది రైతులకు రూ.లక్ష లోపు రుణాలు మాఫీ అవుతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో తహసిల్దార్ ఆంజనేయులు, విద్యుత్ ఏడీఈ సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ తీగల కరుణాకర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ కనకయ్య, నాయకులు గుజ్జరి రాజు, అన్నెబోయిన భిక్షపతి, మంచాల ఎల్లయ్య, శిరబోయిన శ్రీనివాస్, బానోత్ రాజేశ్‌నాయక్, ఎడ్ల వెంకటస్వామి, ఇల్లందుల శ్రీనివాస్, కుల్ల మోహన్‌రావు, బి.పెద్దిరెడ్డి, సిహెచ్.కృష్ణమూర్తి, కన్న సోమశేఖర్, డానియెల్, మంచాల అనిల్, గాదరి బాబు, అశోక్, చవనబోయిన కుమార్, కె.రాజు, మూల రాజు, శివయ్య, కొడారి రాజయ్య, ఏఈఓలు శిరీష, అనిత, కీర్తిస్నేహ, ప్రశాంత్, తదితర నేతలు పాల్గొన్నారు.

● లింగాలఘణపురం: మండలంలోని సిరిపురం రైతువేదికలో గురువారం రైతు రుణమాఫీ సంబరాలను మండల స్పెషల్ ఆఫీసర్ కేఆర్.లత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టెలివిజన్ ద్వారా సీఎం ప్రసంగాన్ని విన్నారు. ఈ సందర్భంగా ఏవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లింగాలఘణపురం మండలంలో రూ. లక్ష లోపు వ్యవసాయ రుణాలు గల రైతులు 1829 మంది ఉన్నారన్నారు. వారందరికీ మొదటి విడత కింద నేరుగా రైతుల రుణఖాతాలోనే మాఫీ డబ్బులు జమ అవుతాయని సూచించారు. ప్యాక్స్ చైర్మన్ బుషిగంపల ఉపేందర్, మాజీ డ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

● దేవరుప్పుల : రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం దేవరుప్పు లలో రైతులు, కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో దేవరుప్పుల చౌరస్తా వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆ తర్వాత కేక్ కట్ చేసి రైతులకు తినిపిం చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధర్మారెడ్డి, సురేష్‌బాబు, తోటకూరి పాండు కృష్ణ, ఓడపెల్లి రవీందర్, రెడ్డిరాజుల గణేష్, కాడబోయిన గణేష్, రెడ్డిరాజుల రమేష్, తదితరులు పాల్గొన్నారు. రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌ను గురువారం మండలంలోని నీర్మాలలోని రైతు వేదికలో మండల అధికారులు, రైతులు, కాంగ్రెస్ శ్రేణులు వీక్షించారు. ఈసందర్భంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్‌లో డిక్లరేషన్ ఇచ్చిన రాహుల్‌గాంధీ మాట నిలబెట్టామని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన సందేశాలను శ్రద్ధగా విన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్, డీఈఓ రాము, తహసీల్దార్ హసేన్, ఎఓ టెక్నికల్ నిర్మల, ఏఈఓ లు సుదగాని సాగర్, సాయి కిరణ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు నల్ల శ్రీరాములు, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

● చిలుపూర్ : రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి చర్యలు చేపట్టడం పట్ల రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. గురువారం మండలంలోని లింగంపల్లి రైతువేదికలో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి ఆయా గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో రైతులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బైక్‌లపై ర్యాలీగా తరలివెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విక్రమ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రుణమాఫీ ద్వారా రైతులు ఆర్థిక పరిపుష్టి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, టెక్నికల్ ఏవో శిరీష, ఏఈవోలు ప్రవళిక, బూర్ల నర్సింహులు, వినయ్‌కుమార్, చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్లు పొట్లపల్లి శ్రీధర్‌రావు, మామిడాల యాదవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, మాజీ సర్పంచులు ఏదునూరి రవిందర్, లింగారెడ్డి, నాయకులు బొమ్మిశెట్టి బాలరాజు, తీగల మహేందర్, ఎడవెళ్లి మల్లారెడ్డి, రంగు రమేష్, ఇల్లందుల హరిబాబు, మాదిరెడ్డి యశ్వంత్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, గడ్డమీది వెంకటస్వామి, కరుణాకర్‌రెడ్డి, గొంగిడి కృష్ణమూర్తి, మాలోతు రాజు నాయక్, మర్రి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : ప్రధాని నరేంద్రమోదీ దేశంలో బడాబాబుల, పారిశ్రామిక వేత్తల, కార్పోరేట్ శక్తులకు అండగా ఉండి వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తే సీఎం రేవంత్ సర్కార్ రైతుల రుణాలను మాఫి చేసి చరిత్ర సృష్టించిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యలు తెలిపారు. రైతు రుణామాఫీ నిధుల విడుదల సందర్భంగా మండలంలోని ఛాగల్ గ్రామంలో రైతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఎంపీలు ముఖ్య అతిధులుగా పాలొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగరబోయిన శ్రీరాములు, కుందురూ వెంకట్ రెడ్డి, జూలకుంట్ల శిరీష్ రెడ్డి, సీహెచ్ నరేందర్ రెడ్డి, బెలిదె వెంకన్న, వెంకటేశ్వర్ రెడ్డి, పోగుల సారంగపాణి, రాపోలు మధుసూధన్ రెడ్డి, బూర్ల శంకర్, నాగరబోయిన యాదగిరి, కనకం రమేష్, మందపురం ఎల్లాగౌడ్, యార కొమురెల్లి, మంతెన ఇంద్రసేనా రెడ్డి, డాక్టర్ కిషన్‌రాజ్, కోతి రాములు, వక్కల రాజు, చేపూరి కుమార్, పొన్న రాజేష్, ఎదునూరి రాజు, పొన్నం రమేష్‌గౌడ్, నరహరి, పల్లె రవీందర్, పొన్న రాజేష్ పాల్గొన్నారు. కాగా డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళ్లు అర్పించి అనంతరం డివిజన్ కేంద్రంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ చేబట్టారు.

కొమ్మూరి ఆధ్వర్యంలో..

జనగామ :రుణమాఫీతో రాష్ట్రంలోని రైతుల కుటుంబాల్లో సీఎం రేవంత్‌రెడ్డి సంతోషాన్ని నింపారని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నా రు. రుణమాఫీ అమలు నేపథ్యంలో జిల్లాకేంద్రంలోని చౌరస్తాలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సంబురాలు నిర్వహించారు. నాయకులు చెంచారపు బుచ్చిరెడ్డి, నిమ్మతి మహేందర్‌రెడ్డి, బనుక శివరాజ్‌యాదవ్, బడికె ఇందిర, వంగాల కల్యాణి మల్లారెడ్డి, రాంచంద్రం, జక్కుల అనిత, బొట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

● తరిగొప్పుల : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం గురువారం రైతులకు రూ. 200000 రుణ మాఫీ ప్రారంభించిన నేపథ్యంలో వ్యవసాయశాఖ, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండ ల రైతాంగం స్థానిక రైతు వేదిక ప్రాంగణంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వగలబోయిన యాదగిరి, మండల వ్యవసాయాధికారి సంతోష, నాయకులు అర్జుల మధుసూధన్ రెడ్డి, దామెర లూక, అమిరిశెట్టి వీరేందర్, పండుగ కనుకయ్య, పింగిళి నరేందర్ రెడ్డి, బ్యాంగి శివకుమార్, సంపత్ పాల్గొన్నారు.

అడ్డంకులు ఎదుర్కొంటాం : కావ్య

● లింగాలఘణపురం : గత ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసి ప్రభుత్వంపై మోయలేని భారం పెట్టిందని అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ రుణ మాఫీ పథకాన్ని అమలు చేసితీరారని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. గురువారం లింగాల ఘణపురం మండలం నెల్లుట్లలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎంపి కావ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పీసీసీ నాయకురాలు సింగపురం ఇందిర, మాజీ జడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు. రైతులను ఆదుకునేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం లింగాలఘణపురం మండలం నెల్లుట్లలో జరిగిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

● నర్మెట, కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష లోపు రుణమాఫి చేయడంతో మండల కాంగ్రెస్ నాయకులు మండలకేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. డీసీసీ కార్యదర్శి గంగం నర్సింహరెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రజ్ఞాపురం శ్రీధర్, దేవులపల్లి భాగ్యలక్ష్మి, పులి రేణుక, చెవుల రాజు, పల్లె ప్రభుదాసు పాల్గొన్నారు.


పాలకుర్తిలో ఎద్దుల బండిపై వస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


దేవరుప్పులలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు


జఫర్‌గడ్‌లో రేవంత్ చిత్రటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


నర్మెటలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు


కొడకండ్లలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు


బచ్చన్నపేటలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు అవసరం : కడియం

చిలుపూర్, జూలై 18 : పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు అవసరమని, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రూ 2లక్షల రుణమాఫీకి చర్యలు చేపట్టడం సాహసోపేత నిర్ణయమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన తాజా మాజీ ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత -బాలరాజు, ఇతర ఎంపీటీసీల పదవీ విరమణ, సన్మాన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిరతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీతో పాటు, వివిధ గ్రామాల ఎంపీటీసీలను శాలువాలతో ఘనంగా సన్మానించి, మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ చిలుపూర్ మండల కేంద్రంలో రూ 100 కోట్లతో బుగులు వెంకన్న ఆలయ అభివృద్ధి, మం డల కాంప్లెక్స్ నిర్మాణం, పల్లగుట్ట నుంచి కృష్ణాజీగూడెం, ఫతేపూర్, గార్లగడ్డ వరకు బీటీ డబుల్ రోడ్డు, వెంకటేశ్వర్లపల్లి నుంచి చిలుపూర్ మీదుగా వెంకటాద్రిపేట వరకు డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయడంతో పాటు, రూ 104 కోట్లతో వచ్చే ఖరీఫ్‌లోగా కొండాపూర్, శ్రీపతిపల్లి, లింగంపల్లి గ్రామాలకు సాగు నీరందించేం దుకు చర్యలు చేపడతానని స్పష్టం చేశారు. విశిష్ట అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బొమ్మిశెట్టి సరిత -బాలరాజు, వంగాల సగన్మోహన్‌రెడ్డి, చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్లు పొట్లపల్లి శ్రీధర్‌రావు, మామిడాల యాదవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, నాయకులు కేశిరెడ్డి లక్ష్మారెడ్డి, గజ్జెల దామోదర్, మామిడాల లింగారెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, రంగు రమేష్, ఎమ్డీ షకీల్, తాళ్ళపల్లి ఉమ -సమ్మయ్య, సంపత్‌కుమార్, తీగల మహేందర్, గడ్డమీది వెంకటస్వామి, మాలోతు రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న ఇందిర తదితరులు

పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన

పాలకుర్తి, జూలై 18 : మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు సైబర్ క్రైం, మత్తు పదార్థాల నిరోధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల అనర్థాలకు గురవుతారని అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడి విద్యార్థులు వారి జీవితాలను చిత్తు చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాలతో తలెత్తే అనర్థాల వల్ల విద్యార్థులు అన్ని విధాలుగా నష్టపోతారని అన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను ఎంతో కష్టపడి చదివిస్తున్నారని వారి ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు చదవాలని సూచించారు. పాఠశాలలకు చెందిన స్కూల్ బస్సులన నడిపే డ్రైవర్లు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు ఇన్సురెన్స్ ఉండాలని సూచించారు. అదే విధంగా వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వాహనంలోనే ఉంచాలని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు మొబైల్ మాట్లాడుకుంటూ నడపరాదన్నారు. తప్పనిసరి హెల్మెట్ వాడాలని తెలిపారు. ప్రతి వాహనదారుడు ధ్రువపత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై లింగారెడ్డి ఉన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

జనగామ సీఐపై చర్యలు తీసుకోవాలి

జనగామ రూరల్, జూలై 18: తమపై అక్రమ కేసులు నమోదు చేసిన జనగామ సీఐ రఘుపతిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని చీటకోడూర్ పీఏసీఎస్ చైర్మన్ చిర్ర శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. భూ సమస్య విషయంలో జనగామ సీఐ అక్రమంగా 9 మందిపై కేసులు నమోదు చేశారని ఆరోపిస్తూ మండలంలోని ఎర్రగొల్లపహాడ్‌లో బాధిత రైతులు వ్యవసాయ భూమి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిర్ర శీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎర్రగొల్లపహాడ్‌లోని తనకు ఉన్న మూడు ఎకరాల భూమిని తప్పుడు సర్వే నెంబర్లతో ఓ వ్యక్తి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తుడటంతో తను కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నానని తెలిపారు. సీఐ చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తూ తమపై అక్రమంగా కేసులు నమోదు చేసి బెదిరింపులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. ఈ విషయమై జనగామ సీఐ రఘుపతిరెడ్డిని వివరణ కోరగా భూ వివాదంలో ఓ మహిళను బూతులు తిట్టడంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, భూ తగాదాలో ఎటువంటి జోక్యం చేసుకోలేదన్నారు.


భూమిలో కూర్చొని నిరసన తెలుపుతున్న భూ బాధితులు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మేడ స్వామి

జనగామ కల్చరల్, జూలై 18: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జనగామ జిల్లా అధ్యక్షుడిగా మేడ స్వామి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు మేడ పాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్, నీరటి ప్రభాకర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి మేడ స్వామి అధ్యక్షత వహించగా రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్ మాట్లాడారు. ఆగస్టు 9న ఢిల్లీలో జరిగే మాదిగ, ఉపకులాల మహాధర్నాకు మాదిగలంతా తరలి రావాలని కోరారు.

పేకాటరాయుళ్లను పట్టుకున్న పోలీసులు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 18: మండలంలోని మీదికొండ గ్రామంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి పేకాట రాయుళ్లను పట్టుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మీదికొండ గ్రామంలోని అందె అంజనేయులు ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామని తెలిపారు. దాడుల్లో భాగంగా పేకాటరాయుళ్ల వద్ద నుంచి రూ 5,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట ఆడుతూ 6గురు వ్యక్తులు అందె అంజనేయులు, గుర్రం ప్రభాకర్, జోగు యాకుబ్, జోగు రాజు, జోగు బాబు, గాదె కుమార్‌లు పట్టుబడ్డారని తెలిపారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ ముస్క రాజు తెలిపారు.

'హిందూ దేవాలయాల వద్ద హలాల్ చేయొద్దు'

జనగామ రూరల్, జూలై 18: హిందూ దేవాలయం వద్ద హాలాల్ చేయకూడదని డిమాండ్ చేస్తూ హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి నాయకులు గురువారం యశ్వంతపూర్ ఎల్లమ్మ దేవాలయం, జిల్లా కేంద్రంలోని అమ్మబావి ఉప్పలమ్మ దేవాలయం వద్ద బ్యానర్లు కట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంతెన మణి మాట్లాడుతూ హిందూ దేవాలయాల వద్ద హాలాల్ చేస్తే మహ పాపమన్నారు. వెంపటి అజయ్, నగేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

బచ్చన్నపేట, జూలై 18: సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ విశాలాక్షి కోరారు. గురువారం బచ్చన్నపేట జీపీ వద్ద తెలంగాణ సాంస్కృతిక సారథి బృందంచే ఆట,పాటల ద్వారా వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గణేశ్, సంజీవ, శంకర్, కెకె రాజు, శ్రీనివాస్, సోమయ్య, చంద్రశేఖర్, రత్నం, స్వప్న, మమత పాల్గొన్నారు.

శివునిపల్లి ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 18: మండలంలోని శివునిపల్లి డివిజన్ ఆటో యూనియన్ నూతన కమిటీని గురువారం జరిగిన ఆటో యూనియన్ కార్మికుల సమావేశంలో ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా గజ్జెవల్లి దయాకర్, గౌరవ అధ్యక్షుడిగా బూట్ల వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా కడుదురి రమేష్, ప్రధానకార్యదర్శిగా నర్సింగోజు పరమేశ్, కార్యదర్శిగా తాళ్లపల్లి వెంకన్న, కోశాధికారిగా కూరపాటి రాజు, కార్యవర్గ సభ్యులుగా చంద్రమౌళి, నరేష్, షబ్బీర్, అంజయ్య, సోమయ్య, యాదగిరి, శ్రీకాంత్, రాజు, జ్యోతి, అంజన్న, రజనీకాంత్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా శ్వేత

జఫర్‌గడ్, జూలై 18 : బీజేపీ అనుబంధ మహిళా మోర్చా జఫర్‌గడ్ మండల అధ్యక్షురాలిగా గాదెపాక శ్వేత నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయం వద్ద మండల నాయకుల సమక్షంలో శ్వేతకు నియామక పత్రం అందజేశారు. మండలంలోని ఉప్పుగల్లుకు చెందిన శ్వేత గత కొన్నేళ్లుగా పార్టీలో చురుకుగా పని చేస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తోంది. కాగా. తన సేవలను గుర్తించి మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా నియమించినందులకు జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, సహకరించిన మండల నాయకులకు శ్వేత కృతజ్ఞతలు తెలిపారు.